క్లుప్తంగా

నేడు ఆధార్ కేంద్రం ప్రారంభం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని హెడ్ పోస్టాఫీసులో ఆధార్ సేవా కేంద్రాన్ని శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు కొత్తగూడెం పోస్ట్ మాస్టర్ ఎన్‌వీఎల్ ప్రసన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఆధార్ కార్డులలో సవరణలు, కొత్త ఆధార్ కార్డులను నమోదుకు ఉపయోగించుకోవాలని కోరారు.

కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): చిరు వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ జిల్లా నాయకుడు జేబీ శౌరి గురువారం చిరు వ్యాపారులతో కలిసి కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెంలోని కూలీలైన్‌లో పండ్లు, కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న చిరువ్యాపారులపై సింగరేణి యాజమాన్యం, మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల వ్యాపారాలు మానివేసి రోడ్డుపై భిక్షాటన చేసుకునే పరిస్థితి వచ్చిందని, తమ భార్యాపిల్లలకు అన్నం పెట్టుకునే అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. సమస్యను త్వరలో పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు శౌరి తెలిపారు.

రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులకు హాజరుకండి..



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తగూడెంటౌన్: ఈ నెల 28, 29 తేదీల్లో హైదరాబాద్ డాన్ బాస్కో హాల్ ప్రగతినగర్ రామాంతపూర్‌లో రాష్ట్రస్థాయి సామాజిక, రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని సేవాలాల్ సేన జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, టీజీటీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. ఈ మేరకు గురువారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. గిరిజన జాతి కోల్పోతున్న సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షిస్తూ రాజ్యాంగలో గిరిజనులకు కల్పించిన హక్కులు, బహుజన వర్గాల అభివృద్ధిపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ధరావత్ సురేష్, లావుడ్యా వెంకటేష్, బానోతు నాగరాజు, జరుపుల లాలు, బానోతు లక్ష్మణ్, అనిల్ పాల్గొన్నారు.

భవిష్యత్‌కు పునాది ఎంవీటీసీ

- సింగరేణి గనుల్లో రక్షణ, వృత్తి నైపుణ్యాలకు ఆయువు పట్టు
- జనరల్ మజ్దూర్ నుంచి సూపర్‌వైజర్ స్థాయి వరకు శిక్షణ
- అప్రెంటిస్, స్కిల్ డెవలప్‌మెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు విధి నిర్వహణపై మెళకువలు



ట్రైనింగ్‌కు హాజరైన అప్రెంటిస్ అభ్యర్థులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి భూగర్భ, ఓపెన్ కాస్ట్, సర్ఫేస్ విభాగాలలో పనిచేయాలన్నా.. అప్రెంటిస్, స్కిల్ డెవలప్‌మెంట్, కాంట్రాక్ట్ కార్మికులు విధుల్లో చేరాలన్నా ముందుగా మైన్స్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ (ఎంవీటీసీ)లో శిక్షణ పొందిన తరువాతే విధుల కేటాయింపు చేస్తుంది సింగరేణి కంపెనీ. ఈ శిక్షణ కేంద్రాలు సింగరేణి వ్యాప్తంగా 10 ఏరియాల్లో కంపెనీ ఏర్పాటు చేసింది. ఆయా ఏరియాల్లోని గనులు, డిపార్ట్‌మెంట్‌లలో ఉద్యోగంలో చేరే ముందు, చేరిన తరువాత వృత్తిపరమైన శిక్షణ, గనుల్లో రక్షణతో విధులు ఏ విధంగా చేయాలో సింగరేణి సంస్థ 1964లో ఈ శిక్షణ సెంటర్లను ఏర్పాటు చేసింది.

గనుల్లో చేరే వ్యక్తికి పీపీఈ తప్పనిసరి..

సింగరేణి భూగర్భ గనుల్లో పనిచేసే ఏ వ్యక్తి అయినా పర్సనల్ ప్రొటెక్షన్, ఎక్విప్‌మెంట్ తప్పనిసరి. వీటిలో హెల్మెట్, హెడ్ లైట్, రేడియం జాకెట్, ఎయిర్ మఫ్, వెంటిలేషన్ మాస్క్, బూట్లు, గ్లౌజులు, బెల్ట్, సేఫ్టీ ఆక్సిజన్ రిసీవర్లు తప్పనిసరి. ఈ వస్తువులను కార్మికుడు ధరించిన తరువాతనే గనుల్లో పనులు చేయాల్సి ఉంది. ఈ పీపీఈని జనరల్ అసిస్టెంట్ నుంచి జనరల్ మేనేజర్ వరకు అందరూ తప్పకుండా ఈ కిట్‌ను ధరించి గనుల్లో విధులు నిర్వహించాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీడీఎంఎస్) నిబంధనలు ఉన్నాయి. డీడీఎంఎస్ ఆదేశాల మేరకు కార్పొరేట్ స్థాయిలోని హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెట్ (హెచ్ఆర్‌డీ) సూచనలు, ఏరియా జీఎం సలహాల మేరకు ఈ ఎంవీటీసీ సంస్థలో పనిచేసే జనరల్ అసిస్టెంట్ నుంచి సూపర్‌వైజర్ స్థాయి వరకు వృత్తి, నైపుణ్యత, రక్షణ సూత్రాలను వివరిస్తుంది.



కొత్తగూడెం ఏరియాలో ఎంవీటీసీ శిక్షణ కేంద్రం

నాణ్యమైన శిక్షణ..



సింగరేణి సంస్థ పరిధిలో అప్రెంటిస్ సమయంలో 12 నెలలు థియరీ, ప్రాక్టికల్‌కు సంబంధించిన అన్ని అంశాలను ఎంవీటీసీలో విపులంగా శిక్షణ ఇస్తున్నారు. మేము ఐటీఐలో నేర్చుకున్న విషయాలను క్రోడీకరించి చెప్తున్నారు. శిక్షణ బావుంది.

– సంపత్, అప్రెంటిస్ అభ్యర్థి

యంత్రాల పనితీరు తెలుసుకున్నాం..



ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలో విధి నిర్వహణలో జాగ్రతలు చాలా బాగా చెప్తున్నారు. అంతేకాకుండా భూగర్భగనులు, ఇతర డిపార్ట్‌మెంట్లలోని యంత్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించే తీరు బాగుంది. ఈ శిక్షణ భవిష్యత్‌కు పునాదిలా ఉంది.

– సాయి మాధురి, అప్రెంటిస్ విద్యార్థిని

ఉత్పత్తిలో మొదటి ఘట్టం



ఉద్యోగులు, సంస్థలో విధుల్లో చేరేందుకు వచ్చిన కార్మికులకు, విధి నిర్వహణ పట్ల ఏవిధంగా నడుచుకోవాలో, గనుల్లో రక్షణ సూత్రాలను ఏవిధంగా పాటించాలో శిక్షణ ఇవ్వటం ఎంవీటీసీ ముఖ్య విధి. ఏ ఉద్యోగం చేయాలన్నా వారికి శిక్షణ తప్పనిసరి.

– జి.లక్ష్మణ్, ఎంవీటీసీ మేనేజర్

కమ్యూనిస్టులు పేదల పక్షం



మాట్లాడుతున్న రామ్‌చందర్

టేకులపల్లి: సమాజంలో నిరుపేదల కన్నీళ్లు తుడిచేది, కూడు, గూడు, గుడ్డ కోసం నిత్యం పోరాటాలు చేసేది కమ్యూనిస్టు పార్టీ అని సీపీఐ జిల్లా నాయకుడు గుగులోత్ రామ్‌చందర్ అన్నారు. గురువారం వాగొడ్డుతండా, పాతతడికలపూడి, లక్ష్మీపురం, తావుర్యాతండా, బీల్యాతండా, రుక్మాతండా గ్రామ శాఖల మహాసభలకు హాజరై మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం పోరాటాలు చేసి నిరుపేదలకు వేలాది ఎకరాల భూమి పంచిన ఘన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఐతా శ్రీరాములు, కిర్లపూడి సుందర్ పాల్, నరేందర్, నరేష్, మోహన్, సత్రు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాత డిజైన్ ప్రకారమే నీరు ఇవ్వాలి



హాజరైన పార్టీ కార్యకర్తలు

ఇల్లెందు: సీతారామ ప్రాజెక్టు నీటిని పాత డిజైన్ ప్రకారమే అందించి జిల్లాను సస్యశ్యామలం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఇల్లెందులోని సీపీఎం డివిజన్ కార్యాలయంలో జరిగిన రాజకీయ శిక్షణ తరగతుల రెండోరోజు ఆయన పార్టీ నిర్మాణం – పని పద్ధతులు అనే అంశంపై ఉపన్యాసించారు. సీతారామ ద్వారా సాగు నీటి కోసం పలుమార్లు ఆందోళనలు చేశామని, ఫలితంగా మినీ డిస్ట్రిబ్యూటరీ నిర్మించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సీపీఎం దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తుందని చెప్పారు. ఎస్‌ఏ నబీ, ఆలేటి కిరణ్, టి.కృష్ణ, మోహన్‌రావు, సుల్తానా, సంధ్య, మరియా, ఖాదర్, మదారపు వెంకటేశ్వర్లు, కొడెం బోస్, వెంకటమ్మ, షాతియా, పద్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతికి సంతాపం

పాల్వంచరూరల్: వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ బావమరిది, జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ సభ్యుడు బానోతు కిషన్‌నాయక్(54) గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన స్వగ్రామమైన మండలంలోని పాండురంగాపురం తండాలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. కిషన్‌నాయక్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. అంత్యక్రియలకు హాజరైన ఎమ్మెల్యే రాందాస్ తన బావమరిది పాడె మోయగా, నాయకులు ఏనుగుల అర్జున్‌రావు, అంతోటి పాల్, నూకల రంగారావు, ఎడవల్లి కృష్ణ తదితరులు పాల్గొని సంతాపం తెలిపారు.

బిషప్ యోహాన్ మృతి

ఇల్లెందు: పట్టణంలోని కరెంటాఫీస్ ఏరియాకు చెందిన బిషప్ కత్తీ యోహాన్(60) గురువారం అనారోగ్యంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి చికిత్స పొందుతూ మృతి చెందారు. యోహాన్‌కు భార్య పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల ఇల్లెందు మండల క్రైస్తవ పాస్టర్స్ ఫెలోషిప్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.

రూ.25 పాఠ్యపుస్తకం రూ.460!



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని, బలవంతంగా అధిక ఫీజులు వసూలు చేయటాన్ని నియంత్రించాలని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది.

గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈఓ ఉమాశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యు.హరీష్‌గౌడ్ మాట్లాడుతూ... పేద విద్యార్థులు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారని తెలిపారు. రూ.25 ఖరీదు చేసే పాఠ్యపుస్తకాన్ని రూ.280 నుంచి రూ.460 వరకు అమ్ముతున్నట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం నాయకులు గణేష్, శివ, సత్య అన్వేష్ తదితరులు ఉన్నారు.

రేషన్ దుకాణాన్ని మార్చండి..

టేకులపల్లి: తడికలపూడి గ్రామపంచాయతీ లక్ష్మీపురంలోని రేషన్ షాపును పాత తడికలపూడి గ్రామానికి మార్చాలని పలువురు బాధిత ప్రజలు కోరారు. ఈ మేరకు ఈనెల 23న కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు గురువారం బాధితులు వివరాలు వెల్లడించారు. తడికలపూడి పంచాయతీ పరిధిలో ఉన్న లక్ష్మీపురం, పాత తడికలపూడి, కోక్యాతండా, సూరారం నాలుగు గ్రామాలకు కలిపి లక్ష్మీపురంలో డీలర్ ఇంటి వద్దనే రేషన్ షాపు ఏర్పాటు చేశారు. ఈ షాపు పరిధిలో మొత్తం 548 కార్డులు ఉన్నాయి. రేషన్ కోసం రావాలంటే పాతతడికలపూడి, కోక్యాతండా, సూరారం లబ్ధిదారులు దూరాభారంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి రావాల్సి వస్తోంది. వర్షాకాలం అయితే వీరి బాధలు వర్ణనాతీతం. ఈ పరిస్థితిలో కోక్యాతండా, సూరారం లబ్ధిదారులు రేషన్ కోసం రాలేని దుస్థితి. రేషన్ షాపుని పాతతడికలపూడి గ్రామంలో ఏర్పాటు చేస్తే కోక్యాతండా, సూరారం గ్రామాలకు, లక్ష్మీపురం గ్రామానికి మధ్యలో ఉండటమే కాకుండా దూరాభారం తగ్గుతుంది. లబ్ధిదారులకు న్యాయం చేయాలని బాధిత ప్రజలు విజ్ఞప్తి చేశారు.

ప్రగతి నివేదికల్లో తప్పులుండొద్దు..

ఇల్లెందురూరల్: కేంద్ర ప్రభుత్వ అవార్డుల దరఖాస్తుకు అంశాల వారీగా నివేదికలు పక్కాగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. అవార్డుల దరఖాస్తు ప్రక్రియపై మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు అవగాహన శిబిరం గురువారం నిర్వహించారు. మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో తొమ్మిది అంశాలకు సంబంధించి 147 ప్రశ్నలు ఉంటాయని చెప్పారు. ఆయా అంశాలకు సంబంధించిన అధికారులతో చర్చించి ప్రతి ప్రశ్నకు సమాధానం నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు అనంతరం కేంద్ర బృందాలు గ్రామాలలో పర్యటించి తనిఖీ చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు డాక్టర్ కవిత, డాక్టర్ లోహిత, ఏఓ సతీష్, ఎంపీఓ చిరంజీవి, ఐసీడీఎస్ సీడీపీఓ తార పాల్గొన్నారు.

శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఉమర్

జూలూరుపాడు: మండల కేంద్రంలో శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు ఎస్కే ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జూలూరుపాడులో జరిగిన సీపీఐ (ఎంఎల్) ఎన్డీ పార్టీ మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలూరుపాడులో శాశ్వత మార్కెట్ లేకపోవడంతో ఖమ్మం జిల్లా ఏన్కూర్ వ్యవసాయ మార్కెట్‌కు అనుసంధానంగా ఉప మార్కెట్ యార్డుపై ఆధారపడాల్సి వస్తోందని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. మార్కెట్‌కు కేటాయించిన ప్రభుత్వ స్థలంలో శాశ్వత వ్యవసాయ మార్కెట్‌ను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వల్లోజి రమేష్, బత్తుల గోపి, కూరాకుల నరసింహారావు, సీతయ్య, జాటోత్ నరసింహారావు, కల్తి రామయ్య, రవి పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు ఏరియా అధికారుల నివాళి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న వంగళ శ్రీనివాస్ అనారోగ్యంతో ఈనెల 23న మృతి చెందాడు. ఈ మేరకు గురువారం ఏరియా జీఎం శాలేంరాజు ఆధ్వర్యంలో సంతాప సమావేశం నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ.. సుమారు 37 సంవత్సరాలు సంస్థలో నిబద్ధతతో సేవలందించిన శ్రీనివాస్ ఈరోజు మన మధ్య లేకపోవటం విచారకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏరియా ఇంజనీర్ కే.సూర్యనారాయణరాజు, ఏజీఎం హనాసుమలత, డీజీఎం గామలపాటి వెంకటమోహన్‌రావు, ఎస్.యోహాన్, ఏరియా రక్షణాధికారి వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

శాపంగా మారిన ‘మిషన్ భగీరథ’



పైపులైన్ కోసం తవ్విన గుంతలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రామవరానికి మిషన్ భగీరథ పనులు శాపంగా మారాయని కాంగ్రెస్ నాయకులు హరిసింగ్, ఎస్‌కే లాల్‌అహ్మద్, బి.రాజ్‌కుమార్, పి.శ్రీను, పురుషోత్తం, నారాయణ బుధవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలలుగా రామవరం పంజాబ్‌గడ్డ నుంచి మెయిన్ బజార్ చేపల మార్కెట్ ప్రాంతాలలో పైపులైన్ల నిర్మాణం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే నాలుగుసార్లు జేసీబీతో తవ్వకాలు చేపట్టారని, దీని కారణంగా రహదారి సౌకర్యం లేక, తాగునీటి పైపులైన్లు ధ్వంసమై నీరు సరఫరా లేక, రోడ్లు ధ్వంసం అవుతూ ప్రజలు, వ్యాపారస్తులు, విద్యార్థులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి త్వరగా పనులు పూర్తి చేయించాలని కోరారు. వర్షం వస్తుండడం వల్ల రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయని దీని కారణంగా వైరల్ జ్వరాలు ప్రబలే ప్రమాదం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆదాయం ఫుల్.. ఆదరణ నిల్

- రెగ్యులర్ ఉద్యోగులు లేక నామమాత్రంగానే చెక్‌పోస్టు
- పట్టించుకోని అధికారులు



బొమ్మనపల్లి చెక్‌పోస్టు

టేకులపల్లి: వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ఆదాయాన్ని తెచ్చి పెట్టే చెక్‌పోస్టు నిర్వహణ ఏళ్ల తరబడి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతోనే కొనసాగుతోంది. రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. జిల్లాలో ఇల్లెందు, చర్ల, బూర్గంపాడు, దమ్మపేట, భద్రాచలం, కొత్తగూడెం ఆరు మండలాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో 18 చెక్ పోస్టులు ఉండగా టేకులపల్లి మండలం బొమ్మనపల్లి సమీపంలో కారుకొండ క్రాస్‌రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు ఇల్లెందు ఏఎంసీ పరిధిలో ఉంది. పదేళ్లకు పైగా ఇక్కడ అవుట్ సోర్సింగ్ సెక్యూరిటీ గార్డులతోనే తనిఖీలు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులను నియమించి కేవలం సీజనల్‌గానే కాకుండా ఏడాది మొత్తం చెక్‌పోస్టులో తనిఖీలు చేపడితే ఆదాయం పెరిగే అవకాశం ఉంది. ఈ దిశగా ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఆలోచన చేయడం లేదు. రెగ్యులర్ ఉద్యోగుల నియామకంపైన దృష్టి సారించడం లేదు. వ్యవసాయ ఉత్పత్తులకు రవాణా అవుతున్న లారీల వద్ద ఒక శాతం మార్కెట్ ఫీజు వసూలు చేస్తున్నారు. చెక్ పోస్టుని పక్కాగా నిర్మించి సీసీ కెమెరాను కూడా ఏర్పాటు చేస్తే ఎలాంటి అవకతవకలు జరగవు. ఆదాయం కూడా మరింత పెరిగే అవకాశం ఉంది.

పదేళ్లలో చెక్‌పోస్టు ఆదాయం రూ.3.69 కోట్లు

టేకులపల్లి మండలం బొమ్మనపల్లి సమీపంలో కారుకొండ క్రాస్‌రోడ్ వద్ద ఏర్పాటు చేసిన ఇల్లెందు ఏఎంసీ చెక్‌పోస్ట్ దగ్గ వసూలు చేసిన మార్కెట్ ఫీజు పదేళ్లలో రూ.3.69 కోట్లు కావడం గమనార్హం. 2014–15లో రూ.35.70లక్షలు, 2015–16లో 47.30లక్షలు, 2016–17లో రూ.45.43లక్షలు, 2017–18లో రూ. 35.70లక్షలు, 2018–19లో రూ.20.36లక్షలు, 2019–20లో రూ.36.67లక్షలు, 2020–21లో రూ.2.42లక్షలు, 2021–22 – 28.82లక్షలు, 2022–23లో రూ.51.77లక్షలు, 2023–24లో రూ.36.54లక్షలు, 2024–25లో 23.67లక్షలు, 2025–26లో రూ.5.42లక్షలు మార్కెట్ ఫీజు రూపంలో ఆదాయం వచ్చింది.

మత్తుపదార్థాలతో జీవితం అంధకారం



ఇల్లెందురూరల్: కొమరారంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో మానవహారం చేపట్టిన విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: మత్తుపదార్థాల వినియోగంతో జీవితం అంధకారం అవుతుందని డ్రగ్స్, గంజాయి వంటి వాటికి యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.కవిత అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలోని శ్రీ రామచంద్ర ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన న్యాయ చైతన్య కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువతకు బాధ కలిగినప్పుడు మత్తు పదార్థాలకు అలవాటు పడి దాన్ని వ్యసనంగా మార్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితం గడపాలని సూచించారు. విద్యార్థి దశలో డ్రగ్స్ వినియోగం సమాజంలో అతిపెద్ద సమస్యగా మారిందని, యువత వాటి బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిశితంగా పరిశీలిస్తుండాలని కోరారు. అనంతరం న్యాయమూర్తి విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తమరావు, డిప్యూటీ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ సాహితీ, పావని, ప్రిన్సిపాల్ పి.పద్మ, మారపాక రమేష్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పాల్వంచ: యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పాల్వంచ తహసీల్దార్ దారా ప్రసాద్, డీఎస్పీ ఆర్.సతీష్‌కుమార్ అన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రస్తుత తరంపై మాదక ద్రవ్య వ్యసనం అధిక ప్రభావాన్ని చూపుతోందని, యువతను పెడదోవ పెట్టిస్తోందన్నారు. ఇలాంటి వాటిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐ కె.సతీష్, ఎస్ఐలు కె.సుమన్, ఐ.జీవన్ రాజు, దేవ్‌సింగ్, కల్యాణి, కేటీపీఎస్ ఎస్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఫారెస్ట్ సిబ్బంది, కేఎల్ఆర్, అనుబోస్, కృష్ణవేణి కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇల్లెందు: మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యాలు క్షీణిస్తాయని, అనారోగ్యం బారిన పడతారని, యువత శక్తియుక్తులు నిర్వీర్యం అవుతాయని డీఎస్పీ ఎన్.చంద్రభాను అన్నారు. గురువారం ఇల్లెందు పోలీసు, ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా నిర్వహించిన మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగదాంబా సెంటర్‌లో పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో మానవహారం నిర్మించారు. మాదక ద్రవ్యాల పట్ల జాగ్రత్తగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సీఐ రాంప్రసాద్, పోలీస్ ఎస్ఐలు సూర్య, శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


డ్రగ్స్ వద్దు.. ఆరోగ్యం ముద్దు..

ఇల్లెందురూరల్: యాంటీ డ్రగ్ డేను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాలలో గురువారం డ్రగ్స్ వద్దు.. ఆరోగ్యం ముద్దు నినాదంతో ప్రదర్శనలు నిర్వహించారు. కొమరారం గ్రామంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి గ్రామ కూడలిలో మానవహారం నిర్వహించారు. సుభాష్‌నగర్ హైస్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొమరారం ఎస్సై నాగుల్‌మీరా, ఎంఈఓ ఉమాశంకర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య తదితరులు పాల్గొన్నారు.


టేకులపల్లి: మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం టేకులపల్లిలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ చంద్రభాను మాట్లాడుతూ.. డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి తొలగించేందుకు ప్రతీఒక్కరు సైనికుల వలె పనిచేయాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. యువత మంచి లక్ష్యాలను పెట్టుకొని వాటిని సాకారం చేసుకునే దిశగా అడుగులు వేయాలే కానీ, డ్రగ్స్ కు బానిసలుగా మారకూడదన్నారు. అనంతరం అందరూ యాంటీ డ్రగ్ సోల్జర్‌గా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ టి.సురేష్, ఎస్ఐ అలకుంట రాజేందర్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




ఇల్లెందు: ప్రతిజ్ఞ చేస్తున్న డీఎస్పీ చంద్రభాను, పోలీసులు, విద్యార్థులు



టేకులపల్లిలో యాంటీ డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీలో పోలీసులు, విద్యార్థులు



కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న సివిల్ జడ్జి కవిత



పాల్వంచ: అవగాహన ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్, డీఎస్పీ, ఎస్ఐలు